# జీవనది

అప్పటికి కాశీపతికి ఎనిమిది ఏళ్ళు! అతని చెల్లెలికి నాలుగేళ్ళు. అప్పుడు అతని తండ్రి విశాఖపట్టణంలో ప్రాక్టీసు చేస్తుండేవాడు. అతని అమ్మమ్మకు తనతల్లి ఒక్కతే సంతానం అవటంవల్లా, ఆమె తప్ప అమ్మమ్మకు ఇంకెవ్వరూ లేకపోవటంవల్లా, అమ్మమ్మ తన కూతురుతో పాటు అల్లుడు దగ్గరే వుండేది. అప్పుడు వాళ్ళు పాతమేడలో అద్దెకు వుండే వాళ్ళు. దాన్ని ఎర్రస్తంభాలమేడఅనేవారు. ఆరోజు కాశీపతికిబాగా జ్ఞాపకం అతడు తమ మేడముందు, మరి కొంతమంది పిల్లలతో కలిసి గోళీలు ఆడు కుంటున్నాడు. ఆనాడు వాళ్ళ యిల్లు మహా సందడిగా వుంది. ఎక్కడెక్కడి చుట్టాలూ వచ్చారు.

అతడు గోలీలు ఆడుకునేచోటికి, అతని పెదతండ్రి కొడుకూ, మరొక బంధువూ వచ్చి చూస్తూ నుంచున్నారు. వాళ్ళల్లో వాళ్ళు మాట్లాడు కుంటున్నారు.

"వాడికింకా తెలియదు." అన్నాడు బంధువు.

"ఎనిమిదేళ్ళవాడు. తెలియకేం?" అన్నాడు పెదతండ్రి కొడుకు.

"అసలు తెలికపోదు. కాని సాధకబాధకాలన్నీ తెలియవు." అన్నాడు బంధువు.

కాశీపతికి ఈ మాటలు వినబడుతూనే వున్నాయి. గోలీలు ఆడుతూనే వున్నాడు.

"మీ అమ్మకి జబ్బుగావుందిరా" అన్నాడు పెదతండ్రి కొడుకు. "నాకు తెలుసు" అన్నాడు కాశీపతి. తన పెదతండ్రి కొడుకు వైఖరి అతనికి నచ్చలేదు.

"డాక్టర్లు బ్రతకదని చెప్పారు...." అన్నాడు పెదతండ్రి కొడుకు. కాశీపతికి ఏమి అర్థం అయిందో, ఎంతవరకు అర్థం అయిందో, ఒక్క-క్షణం నిలువుగుడ్లువేసి చూశాడు. పెళ్ళగిలి వొచ్చే ఏడ్పుని ఆపుకొని, ఘోరున ఏడ్చాడు....గోలీలు నేలకి విసరికొట్టి ఇంట్లోకి పరిగెత్తాడు.

"పాపం," అని జాలిపడ్డాడు బంధువు.

"వీడిదింకా నయం, ఎంతచెడ్డా మగవాడు. వీడి చెల్లెలు వుంది" అన్నాడు పెదతండ్రి కొడుకు.

కాశీపతి యింట్లోకి వెళ్ళేటప్పటికి హాల్లో తన పెద తండ్రీ మరి కొంతమంది బంధువులూ, కూర్చొని వున్నారు. ఆ హాల్లో పెద్ద గడియారం వుంది. ఆ గడియారంలో పన్నెండున్నర అయింది. తన పెదతండ్రి గడియారం వంకకు చూచి "ఇంకా అరగంట వుంది" అన్నాడు గద్గద స్వరంతో.

ఒక బంధువు ప్రశ్నార్థకంగా చూశాడు.

"ఒంటిగంట దాటితే, బ్రతికినట్టే అనుకోమన్నాడు. ధన్వంతరి సుబ్బయ్యకొడుకు!" అని జవాబు చెప్పాడు పెదతండ్రి.

"వాడు చెపితే అవుతుంది" అన్నాడు పైబంధువు.

"వీడిసంగతి చెప్పలేంగాని వీడి తండ్రి బాగా చెప్పేవాడు" అన్నారు యింకొకరు.

ఇంతలో ప్రక్క-గదిలోనుంచి రోదన ధ్వనులు వినిపించినై. అందరూ గబగబా గదిలోకి వెళ్ళారు. కాశీపతి సంగతి ఎవ్వరూ పట్టించుకో లేదు. తనుకూడా వాళ్ళతో వెళ్ళాడు. ఆ గదిలో అమ్మమ్మ వుంది. ఆమె "నన్నేంచేసి పోయావే పున్నమ్మ తల్లీ!" అని గుండెలు కొట్టుకుంటూ ఏడుస్తూవుంది. అతని తండ్రి కొంచెందూరంగా కూర్చొని కన్నీరుతుడుచు కుంటున్నాడు. చెల్లెలు వొక బందుగురాలి ఒడిలోవుంది. "దింపండి—

దింపండి" అన్నారు. ఎవ్వరో తన తల్లిని పట్టుకొని మంచం మీదనుంచి దింపుతున్నారు. పెదతండ్రి, "పున్నడూ మా కొంపముంచి పోయావు గదే!" అని గుండెలు అవిసిపోయేటట్టు ఏడుస్తున్నాడు....అంత గంద్ర గోళంలోనూ యెవ్వరో చూశారు కాశీపతిని. "వాడ్ని బయటకు తీసుకు వెళ్ళండి. జడుసుకుంటాడు" అన్నారు. ఎవ్వరో అతన్ని రెక్కపట్టుకొని "నువ్విక్కడ వుండకూడదు. పద" అని బయటకు తీసుకువెళ్ళారు.

* * *

కాశీపతి తల్లి మరణించింది. వొచ్చిన బంధువులు ఎవ్వరిదార్న వాళ్ళు వెళ్ళుతున్నారు. అమ్మమ్మ నోటికి మూతలేదు. తనక్కడవుండాలో వెళ్లాలో తెలియటంలేదు అమ్మమ్మకి—ఈపసిగుడ్డుల్ని ఎట్లా సాకాలో తెలి యటంలేదు. తన అల్లుడు యింకా వయస్సులో వున్నాడు. యివ్వాళ కాక పోయినా మళ్ళా వివాహం చేసుకోకపోడు. ఇక తన బిడ్డలసంగతి యేం కాను? ఇంకా కళ్ళు తెరవని పసికూనలే! వొకవేళ తన అల్లుడు పిల్లల్ని తీసుకొని తనను వెళ్ళిపొమ్మంటాడేమో! ఈ తలపుతో ఆమెగుండె గుభేలు మన్నది. ఒకటే ఏడ్చింది. కాశీపతిని చేత్తో పట్టుకుంది; మనుమరాల్ని చంకన వేసుకొంది. అల్లుడున్న గదిలోకి వెళ్ళింది—"మా మాటేం చెపుతావ్ బాబూ?" అని అడిగింది.

అల్లుడు మాట్లాడేస్థితిలో లేడు. బిత్తరి చూపులు చూస్తూ వూరు కున్నాడు. లంగరుపోయిన జీవితం అయింది ఆయన్ది.

"ఇక పాలముంచినా నీటముంచినా నీదేభారం బాబూ" అన్నది అమ్మమ్మ. "పున్నమ్మ తల్లిని ఈబందరు వద్రకు అప్పగించాబాబూ" అన్నది. "పసికందులు" అన్నది పిల్లల్నిచూపి.

"ఊరుకో" అన్నాడు అల్లుడు. "వాళ్ళు నాబిడ్డలే...." ఇక చెప్ప లేక ఊరుకున్నాడు.

"అవును బాబూ నీ బిడ్డలే...." అంది అమ్మమ్మ.

"నాన్నదగ్గరకు వెళ్ళమ్మా" అని చంకనవున్న మనుమరాలిని దించబోయింది. మనుమరాలు అమ్మమ్మ వదలకుండా కావిలించుకొని గాపుర్నఏడ్చింది. మనుమడు కాళ్ళకు లుంగ వేసుకున్నాడు. "తల్లిలేని బిడ్డలు—మాకిక నువ్వే దిక్కు" అంది అమ్మమ్మ.

* * *

అమ్మమ్మ వూరినుంచి కాస్త దగ్గర బంధువుఒకాయన మరణవార్త విని వచ్చాడు. ఆయన పేరు రామయ్యగారు. సొంతవూళ్ళో అమ్మమ్మకు కొద్దిగా భూవసతి వుంది. అది అతనే చూసి పెడుతుంటాడు—అతనితో తన కష్టాలన్నీ చెప్పుకుంది. అమ్మమ్మ వలవల ఏడ్చింది-"రామయ్య తండ్రీ, నాకేదో వొక దారి చూపు" అని అడిగింది.

"నువ్వు కొన్నాళ్ళు పిల్లల్ని అంటిబెట్టుకుని యిక్కడే వుంటం మంచిదమ్మా" అన్నారు రామయ్యగారు.

"ఎవ్వరిని చూచుకొని బ్రతకను రామయ్యతండ్రీ?" అడిగింది.

"పిల్లల్ని చూచుకొని" అన్నారు రామయ్యగారు—"నీఅల్లుడు గారైనా మంచివారు, సహృదయులు, పిల్లలకుగానీ నీకుగానీ అన్యాయం చెయ్యరు—"

ఆమె పిల్లలను పెట్టుకొని అల్లుడు దగ్గరే వుండిపోయింది.

తరువాత జరిగిన సంగతులు కాశీపతికి అంత స్పష్టంగా జ్ఞాపకం లేవు. ఆ ఎర్ర స్తంభాల మేడనుంచి, మరొక పేటలోవున్న మండువా లోగిలిలోకి యెప్పుడు మారిందీ, ఎందుకు మారిందీ అతనికి స్పష్టంగా జ్ఞాపకం లేదు. తన తండ్రి మళ్ళీ వివాహం చేసుకున్నాడనీ, ఆ వివాహానికి తన్నుకూడా తీసుకువెళ్ళాడనీ చూచాయగా జ్ఞాపకం వుంది. వివాహానికి ముందు అమ్మమ్మ అల్లుడ్ని అడిగింది.

"కాశీపతిని తీసుకువెళ్తున్నావా బాబూ?"

"అవును—"

"అట్లా తీసుకువెళ్ళ గూడదంటారు బాబూ" అంది.

"పెళ్ళి చూడగూడదంటారు ముహూర్తం సమయానికి అక్కడ వుండనివ్వంలే" అన్నాడు తండ్రితో వున్న బంధువు.

"లేదు—" ఏదో చెప్పబోయింది.

"ఆ సంగతి మాకు తెలుసులే" అన్నాడు బంధువు.

కాశీపతి పెండ్లికి వెళ్ళివచ్చాడు. అక్కడ పిల్లలతో ఆడుకోవటం మాత్రం జ్ఞాపకంవుంది అతనికి. పెండ్లయిం తర్వాత పినతల్లి వొకసారి ఇంట్లోకి పిలిచింది. అక్కడ వాళ్ళంతా, "తండ్రిపోలికే కాకపోతే వొక్క చాయ ఎక్కువ" అన్నారు.

ఇంటికి రాగానే అమ్మమ్మ అనేక ప్రశ్నలు వేసింది కాశీపతిని. షుమారుగా ఆ ప్రశ్నలివి:—

"నిన్ను పలకరించారా?"

"పెళ్ళికూతురు ఎట్లావుంది?"

"కట్నం ఎంత చదివించారు?"

"నిన్ను ఎవ్వరు అజ కనుక్కున్నారు?"

"మీ నాన్నదగ్గరే వున్నావా?"

అన్నీ ఇటువంటి ప్రశ్నలే!

కాశీపతి వీటికి సరిగా జవాబులు చెప్పలేకపోయాడు. తరువాత కొద్దిరోజులకే వొక సంఘటన జరిగింది. అది మాత్రం కాశీపతికి బాగా జ్ఞాపకం వుంది.

* * * *

కాశీపతి తండ్రికి కొద్దిగా అప్పులున్నయ్. ప్రాక్టీసు మీద వస్తున్న డబ్బు ఖర్చులకే సరిపోవడంవల్ల, అవి పెరుగుతూ వచ్చినై. తనతండ్రి వొక బాకీదారుకి రెండువేల రూపాయీలు అప్పు ఇవ్వవలసివుంటే, ఆ బాకీ వర్తమనీ లేకపోతే కోర్టుకి వెళ్తాననీ అతను నోటీసు యిచ్చాడు. ఆ డబ్బు ఇమ్మనీ, కొద్ది కాలంలో మళ్ళీ సర్దుతాననీ అమ్మమ్మని ఎవ్వరి ద్వారానో అడిగించాడు ఆయన. అమ్మమ్మ దగ్గర కాస్త డబ్బువుందని ఆయనకు తెలుసు తన కూతురు పొలంమీద వస్తున్న అయివేజు బిడ్డలకని తన దగ్గరే వుంచుతూ ఉంది అమ్మమ్మ. పైగా తన కూతురు నగలు అమ్మగా వొచ్చిన డబ్బు కాస్త వుంది. ఈ డబ్బూ ఆ డబ్బూ రామయ్యగారి దగ్గర వుంచింది అమ్మమ్మ. ఎందుకైనా మంచిదని కాశీపతి తండ్రి రామయ్యగారినికూడా పిలిపించారు. కాశీపతి తండ్రి పెద తండ్రికూడా వచ్చాడు....అమ్మమ్మ, "అది నాబిడ్డ సొమ్ము. నా గొంతులో వూపిరి వుండగా యివ్వను." అనే మాట తప్ప ఇంకొకమాట అనలేదు. రామయ్యగారు కూడా, "పోనీ ఇద్దాం నోటువ్రాసి ఇస్తాం అంటున్నారుగదా?" అన్నారు.

"నువ్వు కూడా అలాగే అంటున్నావా రామయ్య తండ్రీ. ఇవ్వకపోతే ముసలిముండని నేను వ్యాజ్యం ఆడనా? నేను పుటిక్కిమంటే ఈ నా బిడ్డలు ఏం కాను?" అని కన్నీరు మున్నీరుగా యేడుస్తూ అడిగింది అమ్మమ్మ.

"అదికాదమ్మా....ఇప్పుడేదో మీరిక్కడ ఉంటున్నారు. తింటున్నారు. పిల్లలేదో చదువుకుంటున్నారు. కాలం వెళ్ళిపోతూ వుంది. మీరు వేరుగా వుండవలసివస్తే ఆ అయిదు ఎకరాల పొలంలోని పంటా దేనికని సరిపోతుంది?" అన్నాడు....

"ఉన్నదానిలోనే తింటాం రామయ్య తండ్రీ. మా మూడు పొట్టలూ గడవక పోతయ్యా" అన్నది అమ్మమ్మ. "పరాయి పంచన ఉన్న దానికంటే అడుక్కుతింటే మాత్రమేం రామయ్య తండ్రీ!!"

రామయ్యగారు కాసేపు ఆలోచించారు. ఇలా చెప్పారు. "నువ్వు కాస్త ఆలోచించమ్మా నేను ఈ పిల్లల శ్రేయస్సు కోరేవాణ్ణే. మనం

వాళ్ళు చెప్పినట్లు వినకపోతే, పిల్లల్ని తీసుకొని నిన్ను ఇంటిలోనుంచి వెళ్ళ పొమ్మనవచ్చు!"

"ఆఁ!" అన్నది అమ్మమ్మ. అలాగే రామయ్యగారి మొహంలోకి చూస్తూ వుండిపోయింది. ఈ విషయం ఆమెకు ఇటీవల తట్టలేదు. అంతగా ఏదన్నావస్తే పిల్లల్ని తీసుకొని అల్లుడి యిల్లు విడిచిపెడదాం అనుకున్నది అమ్మమ్మ. కలో గంజో తాగుతూ పిల్లల్ని పెద్దవాళ్ళని చేద్దాం అనుకున్నది. యిదేమీ అన్యాయం!! తన బిడ్డల్ని తనకు కాకుండా చేసే వీలుందా? చూచి చూచి, "రామయ్య తండ్రీ, దేవుడు నన్ను యెందుకు యెత్తుకు పోడు?" అని బావుర్న హడలింది అమ్మమ్మ. "నాబిడ్డను యెత్తుకుపోయే బదులు నన్ను యెత్తుకపోకపోయాడా దేవుడు!" అన్నది.

కాశీపతి ప్రక్కనే వున్నాడు: మనుమరాలు వాళ్ళోనే ఉంది. అమ్మమ్మ యేడుస్తుంటే వాళ్ళూ యేడ్చారు. రామయ్యగారి కళ్ళుకూడా చెమ్మగిల్లినై. "అవునమ్మా...వాళ్ళకి తండ్రేగదా గార్డియన్. అన్నది. పిల్లల్ని వుంచుకుంటానంటే కాదన గలిగిందెవరమ్మా? ...పిల్లల్ని ఆయన ఉంచుకోవచ్చు పిల్లలు పెద్దవాళ్ళయ్యేదాకా భార్య పొలంమీద అజమాయిషీ తనే కోరవచ్చు. అప్పుడు నీ గతీ, పిల్లల గతీ యేమవుతుంది?" అన్నారు.

ఈ మాటలతో అమ్మమ్మకు లోకమే తల్లక్రిందులైనట్లు అయింది. కన్నీళ్ళు తుడుచుకుంటూ "పిల్లల్ని తీసుకొని నన్ను వెళ్ళగొడతానన్నాడా బాబూ నా అల్లుడు?" అడిగింది.

"ఆయన అనలేదు....మనం డబ్బు గట్టిగా యివ్వనంటే అనొచ్చు...." అన్నారు రామయ్యగారు....రామయ్యగారు అలా అన్నారే గాని అల్లుడు అన్నాడనే తేల్చుకుంది అమ్మమ్మ.

"బాబూ యిప్పుడు యీ డబ్బు యిచ్చాం అనుకో. రేపు మళ్ళీ ఒక వెయ్యి తెమ్మంటారు....అప్పుడు యివ్వనన్నా యింతేగా....! ఆయన పెళ్ళి చేసుకున్నాడు. ఒకటి రెండేళ్ళల్లో పిల్లలు కలుగుతారు. అప్పుడు నన్నూ

నాబిడ్డల్ని చూస్తాడా ఆయన? అప్పుడాయనకు మేం కనపడతామా బాబూ. చేతులో డబ్బు వొదులుకుంటే యీ పసిపిల్లవాళ్ళ గతి ఏం కాను రామయ్య తండ్రీ?"

ఈ మాటలకు రామయ్యగారు జవాబులు చెప్పలేకపోయారు. ఆయన కళ్ళవెంట కన్నీరు బొట బొట కారనారంభించింది. కాశీపతికి ఏమి అనిపించిందో!! మాటలు పెకిలించాడు. "ఇక్కడనుంచి మనం వెళ్ళిపోదాం అమ్మమ్మా!" అన్నాడు. నిజానికి అతనికి తండ్రిమీద ఏ కోపమూ లేదు. డబ్బు పోవటంవల్ల వచ్చే చిక్కులు తెలిసీ కాదు. అమ్మమ్మ ఏడుపు చూడలేక మాత్రమే అన్నాడు.

"మా బాబే! ఎంత మాటన్నావురా తండ్రీ...." అని మనుమణ్ణి కావిలించుకొని మళ్ళీ వెంటనే "ఎక్కడికి వెళ్తాం బాబూ? పున్నమ్మ తల్లి మనకీ లోకంలో వుండటానికి ఇంత స్థలం కూడా లేకుండాచేసి పోయిందిరా తండ్రీ." అని ఏడ్చింది బతికి వున్నప్పుడు అమ్మమ్మ కూతురు అవసరానికి తన పేరు వున్న యిల్లు అమ్మి డబ్బు భర్తకిచ్చింది.

* * * *

ఆరాత్రి అమ్మమ్మ మనుమడిని, మనుమరాలినీ చెరొక ప్రక్కనా పెట్టుకొని పడుకొనివుంది. ఆ సాయంకాలమే వెళ్ళిపోయారు రామయ్యగారు....ఆయన్తో "నాలుగయిదురోజుల్లో డబ్బు పంపుతాను" అని అల్లుడికి చెప్పమన్నది అమ్మమ్మ. ఆయన అలాగే చెప్పివెళ్ళాడు. కాని మనస్సులో మాత్రం అమ్మమ్మకు ఏ పరిస్థితుల్లోనూ డబ్బు యివ్వాలనిలేదు. అలా అనకపోతే పిల్లల్ని తీసుకొని తన్ను వెళ్ళమంటారేమోనని భయంవేసి అలా అనమన్నది. ఇక అల్లుడు ఇంటిలోనుంచి తన వూరు పిల్లల్ని జేరవెయ్యటాన్ని గురించే ఆలోచించటం మొదలు పెట్టింది ఆమె. ఏదో వొకవిధంగా తనూ తన పిల్లలూ తన ఊరుజేరితే, ఇక ఎవ్వరూ ఏం చెయ్యలేరు అనుకున్నది. ఆ వూళ్ళో తమకు కష్టం వొచ్చినా, నిష్ఠురం వొచ్చినా ఆదుకోటానికి రామయ్యగారు వున్నారు. ఎరిగినవాళ్ళు అనేక

మంది వున్నారు. వాళ్ళంతా పున్నమ్మబిడ్డల్ని నెత్తిన పెట్టుకొని పెంచు తారు.

ఆ రాత్రంతా ఆమెకు నిద్దురలేదు. తన తొమారులో పిల్లలబట్టలు మూటకట్టింది. తెల్లవారి నాలుగుగంటలకు తన వూరు వెళ్ళే రైలువుందని తెలుసుకుంది. పిల్లలు దాచలేరని తన ఉద్దేశం. వాళ్ళకికూడా చెప్పలేదు. మూడు గంటలకు, యింటికి ప్రక్కనేవున్న యెద్దుబండిని మాట్లాడింది. కాశీపతిని లేపింది.

నిద్రకళ్ళతో, "ఎక్కడికమ్మమ్మా?" అని అడిగాడు కాశీపతి.

"మన ఊరు వెళ్దాం అన్నావుగా బాబూ?" అన్నది. "వెళ్దాంపద!"

కాశీపతి చెయ్యిపట్టుకొని, మనుమరాల్ని చంకనవేసుకొని, బండి వాడికి మూటయిచ్చి, దొడ్డిదార్న బయటకు నడిచింది అమ్మమ్మ....గడప దాటి బండి ఎక్కింది. బండి కదల బోయేముందు, "నీ బిడ్డల్ని కాపాడుకునే భారం నీదే పున్నమ్మ తల్లీ!" అని మనస్సులో అనుకుంది. దేవుడికి దణ్ణం పెట్టుకుంది.

బండి రైలుస్టేషన్ వైపుకి కదిలింది.

)o............o(